వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 20 ఆగష్టు 2024

## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

కడప, ఆగస్టు 19, ప్రభాతవార్త



అర్జీదారులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక హాలులో జెసి అదితిసింగ్, డిఆర్‌డిఎ పిడి ఆనంద్‌నాయక్, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మిలతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించుకోవాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి విజయ్‌కుమార్, వ్యవసాయ శశఖ జెడి నాగేశ్వరరావు, డిఎంహెచ్ఓ నాగరాజు, సిపిఓ వెంకటరావు, జెడ్పీ సిఇఓ సుధాకర్‌రెడ్డి, డిటిసి మీరా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రక్షాబంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివకుమార్‌కు రాఖీ కడుతున్న ఓంశాంతికి చెందిన బ్రహ్మకుమారీలు

# నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

లక్కిరెడ్డిపల్లె, ఆగష్టు 19, ప్రభాతవార్త:

రాయచోటి నియోజకవర్గంని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తామని యువజన రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు మరి చెట్టు వద్ద యాలమంద మహర్షి కుటుంబ నూతన గృహ ఆహ్వానం మేరకు వారి స్వగృహం నందు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు దుశాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొదటిగా అందరికీ రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రధానమైన సమస్యలు త్రాగునీరు రోడ్లు మురికి కాలువలు పక్కా గృహాలు సమస్యలు తమ దృష్టికి వచ్చిందన్నారు అంతేకాకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు త్వరలోనే మహిళలకు ఉచిత బస్సులు అందుబాటులోకి రానుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రెడ్డి యాదవ్ మండల తెదేపా యువ నాయకులు మదన్మోహన్, మానవతా యూనిట్ అధ్యక్షులు డాక్టర్ షఫి నాయక్ హరీష్ వెంకటరామరాజు విష్ణు గురుస్వామి వెంకటేష్, యాదవ్, సోమల ఆంజనేయులు వెంకట కృష్ణయ్య వేమయ్య, చంద్ర, రెడ్డి శేఖర్ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గండికోట జలాలు విడుదల చేసిన కూటమి నేతలు



ముద్దనూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:

వామికొండ సర్వరాయ సాగర్‌లకు గండికోట జలాలను కమళాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ భూపేష్ రెడ్డి ముద్దనూరు మండల పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామం సమీపంలో ఉన్న హెడ్ రెగ్యులేటర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 500క్యూసెక్కుల నీటిని సోమవారం నాడు విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో వర్షం తక్కువ కావడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని అందులో భాగంగా తాగు, సాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో గండికోట జలాశయం నుండి రైతులకు కొంత మేర నీటి ఎద్దడి తగ్గుతుందన్న ఉద్దేశంతో గండికోట జలాలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గండికోట నుండి రిజర్వాయర్ శెట్టివారిపల్లె రెగ్యులేటర్ కాలువ ద్వారా రెండు గేట్ల నుండి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. వామి కొండ ప్రాజెక్టు కింద 10వేల ఎకరాలకు, సర్వరాయ సాగర్ కింద 25వేల ఎకరాలకు నీరు అందేలా చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కమళాపురం యువ నాయకుడు పుత్తా లక్ష్మిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉచిత ఇసుక ప్రజలకు అందించడంలో...

# ప్రభుత్వ విధాన నిర్ణయం తీవ్ర జాప్యం

- అవసరాల కోసం అక్రమార్కులను ఆశ్రయిస్తున్న జనం
- నారాయణ నెల్లూరులో టాస్క్‌ఫోర్స్ దాడులు
- పెద్దఎత్తున టిప్పర్లు, యంత్రాలు స్వాధీనం
- కూటమి, వైసీపీ వర్గాలు పోటీలు పడి ఇసుక అక్రమ రవాణా
- రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి ఇసుక అక్రమ రవాణా



ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు



రాజంపేట అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తామంది. తక్కువ రేటుతో ప్రజలకు ఇసుక అందిస్తామని విధాన ప్రకటన చేసింది. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటుతున్న రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల ప్రజలకు ఇసుక అందుబాటులోకి రాలేదు. సాంకేతిక కారణాలతో విధాన నిర్ణయాల అమలులో జాప్యం ప్రజలకు శాపంగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నోటిఫికేషన్ తరువాత అధికారికంగా ఇసుక క్వారీలకు అనుమతి లేకపోయిన విచ్చలవిడిగా కౌంటింగ్ రోజు వరకు పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరిగింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక వస్తుందని ప్రజలు సంతోషించారు. ట్రాక్టర్ ఇసుక రాజంపేటలో వైసీపీ హయాంలో రూ.4వేలు పలికేది. ఉచిత ఇసుక కారణంగా అధిక రేటు నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రజలు భావించారు. అయితే నేటికి అతీగతీ లేదు. ఫలితంగానే ప్రజలు అవసరాల కోసం ఇసుక అక్రమ రవాణా దారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇసుక అక్రమ రవాణాలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అన్న తేడా ఏమి లేదు. ఇరువర్గాలు అవకాశం వస్తే అక్రమ రవాణకు పోటీపడుతున్నారు. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా ప్రతి రోజు రాత్రి 10గంటలు దాటిన వెంటనే వందలాది ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న విశయం అందిరికి తెలిసిన రహస్యమే. చెయ్యేరు నది పరివాహక గ్రామాల ప్రజలకు ఇసుక రవాణా ఉపాధిగా ఉండేది. గత రెండు నెలలుగా ఇసుక అధికారికంగా తరలించే అవకాశం లేకపోవడంతో అధికారులకు తెలియకుండా గుట్టుగా ఒకవైపు కేసులు పెడుతున్నా అక్రమ రవాణా చేసేందుకు జంకడం లేదు. దీనికి ప్రధాన కారణంగా ప్రజల అవవసరాలు తీర్చడంతో పాటు ఉపాధి పొందుతున్నామని వారంటారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించినప్పుడు నదుల్లో కూలీలను పెట్టి అవసరమైన వారికి ఇసుక తరలిస్తే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. నారాయణ నెల్లూరు వద్ద వైకాపా హయాంలో ఇసుక క్వారీ ఉండేది. ఈ ఇసుక క్వారీలో లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను భారీ యంత్రాలతో తరలించారు. ఈ క్వారికి అనుమతి లభించే అవకాశం లేదు. అయితే ఇదే మండలంలో గతంలో కోమంతరాజుపురం, ఎన్నార్‌పురం, రాజంపేట మండలంలో ఇసుకబల్లె, శేశమాంబపురం వద్ద ఇసుక క్వారీలు ఉండేవి. అలాగే నందలూరు మండలంలో టంగుటూరు, ఆడపూరులో కూడ క్వారీలు ఉండేవి. ఇన్ని క్వారీలు ఉన్న గతంలో ఒక్కదానికి కూడ ప్రభుత్వం అనుమితి ఇవ్వకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. కారణాలు ఏమైనా ప్రజలకు నిత్య అవసరం అయిన ఇసుకను అందుబాటులోకి తీసుకురాకపోవడం పల్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నదిలో యంత్రాలకు అనుమతి లేకుండా కూలీలతోనే ఇసుకను తరలిస్తే తప్పేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు ప్రజల అవసరాలకు తగినట్లు ఉండాలే కానీ నిబంధనల పేరుతో నెలల తరబడి నిర్ణయాలు తీసుకోకపోతే అవసరాలు ఆగుతాయా, అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణాకు అలవాటు పడి మిన్నుకుంటారా అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఏదిఏమైనా ఆదివారం రాత్రి జరిగిన సంఘటన అధికార పక్షానికి ఒక విధంగా షాక్ అని చెప్పవచ్చును.

ఇరు వర్గీయులు కూడ ఇసుక అక్రమ రవాణాలో పాలు పంచుకుంటున్నారు. ఎక్కువ మంది టీడీపీ వర్గాల వారే ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతి రోజు లాగే ట్రాక్టర్‌లు నారాయణ నెల్లూరు సమీపంలోని చెయ్యేరు నదిలోకి వచ్చాయి. అయితే ఊహించని విధంగా టిప్పర్లు, లారీలు తరలివచ్చాయి. పెద్ద హిటాచి యంత్రం ఇసుకను తోడేందుకు వచ్చింది. 50ట్రాక్టర్లు దాకా వచ్చాయి. ఈ టిప్పర్లు ఓబుళవారిపల్లె మండలం నుంచి వచ్చినట్లు సమాచారం. అంతకుముందు ట్రాక్టర్లలో కూలీలతో ఇసుకను నింపి కాకర్లవారిపల్లె, పుల్లంపేట రోడ్డు తదితర ప్రాంతాలో రహస్యంగా డంప్ చేసి అక్కడి నుంచి రైల్వేకోడూరుకు తరలించేవారు. ఇది ఉపాధిగా ఉండేది. అయితే ఊహించని విధంగా టిప్పర్లే ఓ అధికార పార్టీ నేత పేరు చెప్పి నారాయణ, ఎల్లేరుకు పోవడంతో స్ధానికులు అంగీకరించలేదు. వచ్చిన టిప్పర్లు, భారీ యంత్రాలు వెనక్కు వెల్లలేదు. ఫలితంగా గ్రామస్థులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. స్పెషల్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ విశయాన్ని పోలీసుల దృష్టికి తీసుకుపోయారు. ఈ క్రమంలో పెద్దఎత్తున ఎస్సీబి అధికారులు వెనక్కి వచ్చేయాలని ఇద్దరు నేతలు ఒత్తిడి చేసినట్లు సమాచారం. అప్పటికే ఎస్సీబి ఉన్నతాధికారులకు కూడ ఈ విశయం చేరింది.

దీంతో ఎస్సీబి అధికారులు తమ పరిధిలో లేదని ఇసుక రవానాను అనుమతిస్తే తమ ఉద్యోగాలు పోతాయని అధికార పార్టీ నేతలకు తేల్చి చెప్పారు. వెంటనే 8టిప్పర్లు, ఒక పెద్ద హిటాచి యంత్రాన్ని స్వాధీనం చేసుకొని పెనగలూరు పోలీసులకు ఎస్సీబి సీఐ పవన్‌కుమార్ అప్పగించారు. ఓ ప్రజాప్రతినిధి ఏకంగా పెనగలూరుకి చేరుకొని తీవ్ర ఒత్తిడి చేసినట్లు కూడ సమాచారం. ఈ నేపథ్యంలో ఇసుక సమస్యను ఇప్పటికైన జిల్లా యంత్రాంగం పరిష్కరించి అక్రమ రవాణాలను అరికట్టేందుకు అధికారికంగా 12క్వారీలను రాజంపేట, పెనగలూరు, నందలూరు, పుల్లంపేట మండలాల్లో కనీసం 2ఇసుక క్వారీలను అనుమతించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## విశ్వ సౌభ్రాతృత్వానికి ప్రతీక రాఖీ

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:



సౌభ్రాతృత్వానికి ప్రతీక రాఖీ అని ఓం శాంతి భవణ్ నిర్వాహకురాలు బికె శాంత తెలిపారు. సోమవారం రాఖీ పౌర్ణమి సంధర్భంగా వారు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, తహసీల్దార్ గంగయ్య, వైద్యులు మహేష్, రామసుబ్బారెడ్డి, లీలావతిలకు రాఖీలు కట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సనాతన భారతీయ సంప్రదాయాన్ని గుర్తు చేస్తూ, ధర్మాన్ని రక్షిస్తూ విలువలను పెంపొందించేందుకు గుర్తుగా, విశ్వమానవ కళ్యాణం కోసం స్త్రీ, పురుషులు ఇరువురికి వర్తమాన కలియుగంలో భగవంతుని రక్షణ అవసరమని చెప్పే రక్షాబంధనం యజ్ఞోపవితం కావడం వల్ల దీని జంధ్యాల పౌర్ణమి, శ్రావణ పౌర్ణమిగా జరుపుకుంటారని, కులమతాలకు అతీతంగా దూరంగా ఉన్నవారిని దగ్గరికి, దగ్గరిగ ఉన్నవారిని మరింత దగ్గరికి చేరుస్తూ సంబంధాలను బలపరిచే విశ్వ సోదర సౌభ్రాతృత్వానికి విలువలకు ప్రతికగా రక్షాబంధన్ పండుగ జరుపుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో బహ్మకుమారీలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అశ్రద్ధ చూపరాదు



రాయచోటి, ఆగస్టు 19, ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదు. నాణ్యతే ప్రామానికంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో సత్య నారాయణరావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్ధిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) తరచుగా తమ శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వస్తాయి, దాని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, అది ఏ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందది, దరఖాస్తుదారులతో మాట్లాడాలి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఇందుకు నిర్ధిష్ట కాల పరమితి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఒక వేళ కోర్టు పరిదిలో ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకోవడం చేయాలి. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలి. పెండింగ్ దరఖాస్తులు రీ ఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సీఎం మరియు ఉప ముఖ్యమంత్రి లాగిన్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం అంర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

### జగనన్నా కాలనీలో అక్రమాలను

# విచారించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

రాజంపేట అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:

రాజంపేట మండలంలోని జగనన్నా లే అవుట్లలో జరిగిన అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్య నాయుడు, సుదీర్ నాయుడు, మేకవారిపల్లె టీడీపీ నేత మేక నరసింహులు సోమవారం సబ్ కలెక్టర్ నైదియాదేవిని కలిసి ఫిర్యాదు చేశారు. జగనన్నా లే అవుట్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని వివరించారు. వందలాది ఫ్లాట్లు మిగిలిన అర్హత లేని వారికి ఇష్టారాజ్యంగా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిని విచారించి అర్హులకు మిగిలిన ఫ్లాట్లు కేటాయించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.



## శ్రీ వాసవి గోల్డ్ మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:

శ్రీ వాసవి గోల్డ్ మార్కెట్‌ను గోల్డ్ మర్చంట్స్ సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రె డ్డి, ఆర్యవైశ్య సభ పట్టణాధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు తెలిపారు. పట్టణంలోని గవిని సర్కిల్ ఆదర్శ నగర్‌లో ఏర్పా టుచేసిన శ్రీ వాసవి గోల్డ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని లి ఫ్ట్‌ను బుశెట్టి రామ్మోహన్ రావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం బంగారు అంగళ్ల వీధిలో ఇరు కుగా కాకుండా విశాలంగా వినియోగదారులకు, వ్యాపారులకు అనువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసవి గోల్డ్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు బుశెట్టి రాజశేఖర్, బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, సురేష్, శివశంకర్ రెడ్డి, ఎం.సుధాకర్ రెడ్డి, డిష్ సాంబ పాల్గొన్నారు.



## ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి

కడప క్రైం, ఆగస్టు 19, ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఎపోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలలీసు స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కదర్యాలయాలలో పిర్యాదు చేయొచ్చని సూచించారు. సదరు ఫిర్యాదును ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## భూ సమస్య పరిష్కరించండి

**మదనపల్లెక్రైం, ఆగస్టు 19 ప్రభాతవార్త :**




తమ సొంతపొలంలో సాగుచేసుకోనియకుండా కొందరూ అడ్డుకుంటున్నారని, తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలంటూ బాధితులు తలారి శ్రీనివాసులు, కుటుంబసభ్యులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం గ్రీవెన్స్‌డే లో రామసముద్రం మండలం నారిగానిపల్లి పంచాయితీ పూలకుంట్లపల్లికి చెందిన శ్రీనివాసులు, కుటుంబసభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రామసముద్రం మండలంలోని నారిగానిపల్లి పంచాయితీలో సెటిల్మెంట్ భూమి సర్వేనెంబర్ 305/1లో 17 సబ్‌డివిజన్‌లు వున్న 4.4 ఎకరాల భూమి నాలుగు కుటుంబాలకే చెందిందంటూ తప్పుడు సర్వేలు సృష్టించి తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. మద్దయకఉంట రెడ్డిఇనాం భూమి టిడి నెంబర్ 22లోని 83 సెంట్లు, మరోక టిడి నెంబర్ 1498లోని 2.5 ఎకరాల భూమి కలుపుకొని 1958లో రీ సర్వే చేసి 305 సర్వేనెంబర్‌గా మార్చు చేసి మల్లక్క, ఎర్ర వెంకటప్ప, చిన్న వెంకటప్ప, పెద్ద కొండప్ప, చిన్నకొండప్ప, చిన్న రంగప్ప, యర్రోళ్ల వెంకటప్ప, సి.రామన్న, సి.పాపన్న, పాపిరెడ్డి అనే రైతులకు పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. అందులో 83 సెంట్ల భూమిని పాపిరెడ్డి కొనుగోలు చేయగా, మిగిలిన 2.5 ఎకరాల భూమిని పదిమంది హక్కుదారులు పాపిరెడ్డి, రామచంద్రారెడ్డికి విక్రయించారన్నారు. ఆ పొలంను వారి కూమారులు నుంచి తాము కొనుగోలు చేశామని, అయితే ఆ పొలంలోకి తమను వెళ్లనీయకుండా పూలకుంట్లపల్లికి చెందిన 14 మంది అడ్డుకుంటున్నారన్నారు. తాము కోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా ఇన్‌జక్షన్ ఆర్డర్ ఇవ్వటం జరిగిందన్నారు. కోర్టు ఆర్డర్‌ను పరిగణనలోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు వాపోయారు.

## చర్చి బంగళా కూల్చివేతను అడ్డుకున్న చర్చి వర్గాలు

**రైల్వేకోడూరు,ఆగష్టు 19,ప్రభాతవార్త:**



ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రైల్వేకోడూరు దక్షిణాంధ్ర లూథరన్ చర్చి ఆవరణంలో ఉన్న బ్రిటీష్ కాలంలో నిర్మించిన బంగళాను కూల్చి వేసేందుకు కొందరు వ్యక్తులు మంది మార్బలంతో మారనాయుధాలు తీసుకొని వచ్చారు. మొదట చర్చి ప్రహరీ గోడను కూల్చివేశారు. తర్వాత బంగళా ముందు భాగం క్రును జెసిబి యంత్రాలతో తొలగిస్తుండగా చర్చి వర్గాలు గమనించి అడ్డుకున్నారు. ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో చర్చి వర్గాలకు చెందిన కనుపర్తి చంద్రయ్య, రత్నం, మేరీలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అంతకముందు చర్చి వర్గాలు అల్లూరి సీతారామరాజు విగ్రహం ప్రధాన రహదారిలో రెండు గంటల పాలు బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చర్చి బంగళాను కూల్చి వేస్తున్నారని పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదని చర్చి వర్గాలు ఆరోపించారు. ఆలస్యంగా పోలీసులు రంగ ప్రవేశం చేసి సద్దుమణిచారు. ఈ సందర్భంగా చర్చి సంఘం నాయకులు భాను, భాస్కర్ తదితరులు మాట్లాడుతూ 150 సంవత్సరాల కిందట చర్చిని నిర్మించారని తెలిపారు. చర్చి పక్కనే సేవకులు నివాసం ఉండేందుకు బంగళాను నిర్మించడం జరిగిందన్నారు. చర్చి ఆస్తుల వ్యవహారంలో రెండు వర్గాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఒకరు అమ్మాలని ఇంకొకరు అమ్మకూడదని ఇలా చాలాకాలంగా వివాదాలు జరుగుతున్నాయన్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు ఉన్నత స్థాయి విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారి పై కేసులు నమోదు చేయాలని చర్చి వర్గాలు డిమాండ్ చేశారు.ఇది ఇలా ఉండగా విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తక్షణం కూల్చివేతకు వచ్చిన వారి పై కేసులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆస్తులను కాపాడుతామని ఆయన చర్చి వర్గాలకు హామీ ఇచ్చారు.చర్చి వర్గాలకు భద్రత కల్పిస్థామని తెలిపారు

## శ్రీపాలకొండ్రాయుడు దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తా



**కడప వైద్యవిభాగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

కడప నగర శివార్లలో వెలసిన శ్రీ పాలకొండ్రాయ దేవస్థానాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొస్తానని ఆలయ ఛైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్ సోమవారం ఆలయ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు నాపై నమ్మకం ఉంచి ఈ స్వామి సేవ చేసేందుకు అవకాశం కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు పాల్గొని బుర్రి రెడ్డయ్య యాదవ్‌ను ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆలయ పురాతనమైందని ఆలయానికి భూమి ఉందని ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్య, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైలు జనరల్ బోగీలను పెంచండి

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**



రైలు ప్రయాణం సుఖవంతమైందని భావించి ఎక్కువ శాతం మంది ప్రజలు జనరల్ బోగిలలో ప్రయాణం చేస్తున్నారని ఎక్కువ మంది ప్రయాణం చేస్తున్న బోగీలను తక్కువ చేసి తక్కువ మంది ప్రయాణం చేసే బోగీలను ఎక్కువగా ఉంచాలని ప్రభుత్వాలు ఆదాయం కోసం కాకుండా ప్రజల సౌకర్యార్థం కోసం పని చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ అన్నారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ప్రయాణం పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు ఆర్టీసీ ప్రయాణం అధిక ఛార్జీలు ఉన్న నేపథ్యంలో రైలు ప్రయాణం చేద్దామనుకుంటే ఇది అత్యంత ఇరుకుగా, అసౌకర్యంగా మారిందని మహిళలతో వృద్ధులతో, చిన్న పిల్లలతో ప్రయాణం చేయడం అంటే కత్తి మీద సాము చేయడం లాంటిదేనని 70 శాతానికి పైగా ప్రయాణం చేసే వారికి 2, 3 బోగీలను మాత్రమే కేటాయించి 30% ప్రయాణం చేస్తున్న వారికి అధిక బోగీలను కేటాయించడం ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి తప్ప ప్రజల అవసరాలు తతీర్చడానికి కాదని ఆయనతెలిపారు. ముఖ్యమైన స్టేషన్లలో రైల్లు ఆగేవని ప్రస్తుతం ఆపడం లేదని ఎక్స్‌ప్రెస్ రైల్లు అన్ని ముఖ్యస్టేషన్లలో ఆగే విధంగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు విజయకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

## మద్దిరాల భద్రమ్మ భౌతిక కాయానికి నివాళి



**సుండుపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

రాజంపేట నియోజకవర్గం టి.సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామం కొత్త జంగంపల్లిలో సోమవారం ఉదయం టి.సుండుపల్లె మండలం చిన్న గొల్లపల్లె గ్రామం కొత్త జంగంపల్లెకు చెందిన వాసునూరి జగన్‌మోహనయ్య అత్త ఆదివారం అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకొని మద్దిరాల భద్రమ్మ భౌతిక కాయానికి టీడీపీ బీసీ సాధికార సమితి పాలేకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు(గుట్టబాబు) వారి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార సమితి పాలేకరి రాజంపేట నియోజకవర్గ కమిటీ మెంబర్ గురిగింజకుంట రెడ్డి మల్లప్ప నాయుడు, కొటికే చలపతి నాయుడు, మెరుగు సుదర్శన్ నాయుడు, వాసునూరి మణికుమార్, కొండ్రు శ్రీనివాసులు, మర్రిపల్లి వినోద్‌కుమార్, పసుపులేటి జయరామయ్య, దేవేంద్ర, ముద్దుశెట్టి రామయ్య, కొటికే సుదర్శన్ నాయుడు జరుగుమల్లి రమణయ్య, రామాంజులు, కొండ్రు రమణయ్య, హనుమంతు, సుబ్బరాము తదితరులు పాల్గొన్నారు.

## పగడాలపల్లెలో పుల్లయ్యస్వామి ఆరాధన

**పెండ్లిమర్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

మండలంలోని పగడాలపల్లెలో వెలసిన పుల్లయ్య స్వామి ఆరాధన సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి ఆలయ సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఘనంగా నిర్వమించారు. ఆలయ ధర్మకర్త రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె ఎస్సై లోకేష్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

**తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన లోకేష్‌రెడ్డిని స్థానిక టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ టీడీపీ అధ్యక్షుడు ఉత్తమారెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, జగదీష్, భాస్కర్, చిన్నపరెడ్డి తదితరులు ఎస్సై లోకేష్‌రెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరగా ఆయన స్పందించి రాజ్యాంగబద్ధంగా సమస్యల పరిష్కారంలో తన పూర్తి సహకారం ఉంటుందని రాజకీయ నాయకులు సైతం తనకు సహకరించాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెదేపా కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చక్కెరతో ఎన్నో రకాల ఉపయోగాలు



నిత్య జీవితంలో చక్కెర పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే కేవలం ఆహార పదార్థాల్లోనే కాకుండా ఇతరత్రా
వివిధ సందర్భాలలో చక్కెరను ఎన్నో రకాలుగా
ఉపయోగించవచ్చు. తెలుసుకుందాం..

**మరకలు మాయం..** చేతులకు గ్రీజు అంటుకున్నప్పుడు ఒక్కోసారి ఎంత కడిగినా వదలదు. అలాంటప్పుడు లిక్విడ్ హ్యాండ్‌వాష్‌లో కాస్త చక్కెర వేసి ఆ మిశ్రమంతో చేతుల్ని శుభ్రం చేసుకుంటే నగ్రీజు మరకలు పోతాయి. ఇక మనం గార్డెన్‌లో పని చేసునతన్న ప్పుడు దుస్తులకు మట్టిఅంటుకోవడం సహజం.దీన్ని సులభంగా వదిలించుకోవాలంటే గోరువెచ్చటి నీటిలో కాస్త చక్కెర వేసిపేస్ట్‌గా కలుపుకోవాలి. దీన్ని మరక ఉన్న చోట పూసి గంట పాటు పక్కన పెట్టాలి.ఆ తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుంది,

**వెండి వస్తువులు మెరవాలంటే....** ఉప్పు గాలి, నీరు కారణంగా వెండి వస్తువులు కొన్ని రోజులకు



మెరుపును కోల్పోతాయి. మరి, అలాంటి వాటిని తిరిగి మెరిపించడానికి చక్కెర ఉపయోగపడుతుంది. ఇందుకోసం.. ఒక పాత్రలో మూడు టేబుల్ స్పూన్ల చక్కెర తీసుకొని అందులో టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ వేసి చక్కెర కరిగేంత వరకు బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెండి వస్తువులు కడగడానికి ఉపయోగిస్తే సరి. అవి తళతళా
మెరిసిపోవడం ఖాయం.

**దుర్వాసనను పోగొట్టడానికి.....** మిక్సీ జార్లు, కాఫీ గ్రైండర్స్, ఇతర డబ్బాలు.. వంటివన్నీ ఎక్కువ రోజులు వాడకుండా మూతపెట్టి అలాగే ఉంచడం వల్ల కొన్ని రోజులకు వాటి నుంచి అదో రకమైన వాసన వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు ఆ వాసనను తొలగించడానికి చక్కెర బాగా ఉపయోగపడుతుంది. ఇందుకోసం కాఫీ గ్రైండర్స్, మిక్సీ .జార్ల.. వంటి వాటిలో పావు కప్పు చక్కెర వేసి కాసేపు గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల అందులోని వాసనను చక్కెర గ్రహిస్తుంది. ఇక ఇతర డబ్బాల విషయంలో అయితే ఒక టీస్పూన్ చక్కెరను వాటిలో వేసి మూత పెట్టాలి, తరిగి ఆ బాక్కులను ఉపయోగించుకునే ముందు శుభ్రంగా కడిగితే వాటి నుంచి ఎలాంటి వాసన రాకుండా ఉంటుంది.

**తుప్ప వదలగొట్టండిల..** సామాన్లకు పట్టిన తుప్పును వదలగొట్టే శక్తి చక్కెరకు ఉంది. ఒక నిమ్మకాయ రసాన్ని తీసుకొని అందులో మూడు టేబుల్‌స్పూన్ల చక్కెర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తుప్పు పట్టిన వస్తువులపై వేసి కడిగితే అవి సులభంగా శుభ్రపడతాయి.

**ఫ్లోర్‌పై మరకలు పడ్డాయా?...** టైల్స్‌పై ఏదైనా మరక పడితే అంత సులభంగా వదలదు. అలాంటప్పుడు ఆ మరకను చక్కెరతో శుభ్రపరిస్తే సరి. ఇందుకోసం ఒక గిన్నెలో నాలుగు టేబుల్‌స్పూన్ల వెనిగర్, కద్దిగా చక్కెర తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూదిని ముంచి, మరక ఉన్న చోట రుద్దాలి. అంతే మరక ఇట్టే వదిలిపోతుంది.

**మరిన్నీ...**
- ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత చేతులకు అంటుకున్న వాసన పోవాలంటే.. టేబుల్‌స్పూన్ చక్కెరకు టీస్పూన్ లిక్విడ్ హ్యాండ్‌వాష్ కలిపి ఆ మిశ్రమంతో చేతుల్ని రుద్దుకోవాలి. ఫలితంగా చేతుల నుంచి వాసన రాకుండా జాగ్రత్తపడచ్చు.
- మూడు టేబుల్ స్పూన్ల చక్కెరకు టేబుల్ స్పూన్ బేకింగ్ పౌడర్ కలిపి కొన్ని నీళ్ల పోసి చిక్కగా చేసుకోవలి. ఈ మిశ్రమంతో పాత్రలను శుభ్రం చేస్తే అవి మరింతగా శుభ్రపడతాయి. ఇది సహజసిద్ధమైన డిటర్జెంట్‌లా పనిచేసి వాటిని మెరిపిస్తుంది.



## ఈ నెల 20 మండల సాధారణ సర్వసభ్య సమావేశం

**కాశినాయన, ఆగస్టు 19 (ప్రభాతవార్త):**

ఈ నెల 20వ తేది మంగళవారం ఉదయం 10.30 గంటలకు కాశినాయన మండలం నరసాపురం మండల పరిషత్ సమావేశ మందిరం నందు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పోలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయ,ప్రాథమిక ఆరోగ్యం శాకలలో పనితీరుపై చర్చించడంతోపాటు సాంఘీక సంక్షేమవసతిగృహ, విద్యుత్, తాగునీటి సమస్య రోడ్లు, పశు సంవర్ధక, గృహ నిర్మాణం తదితర అన్ని అంశాలపై చర్చించనున్నట్లు అందులో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన విధివిధానాలపై సమావేశంలో వివరించనుండగా, ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరు కావలెనని, వారికి సంబంధించిన బినామీలు సమావేశానికి అనుమతించబడదని తెలిపారు. అలాగే సంబంధిత అధికారులు తప్పక హాజరు కావలెనని, అలా హాజరు కాని వారిపై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవ వేడుకలు

**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):**



పట్టణంలోని శ్రీ రామచంద్ర రిక్రియేషన్ కల్బ్ ఆవరణలో సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవ వేడులకను ఫోటో, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టి కర్త లూయిస్ డెగూరే ప్రపంచానికి మొదటి ఫోటోగ్రఫి అందించిన వ్యక్తిగా ఆయనను స్మరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే ఫోటోగ్రఫి సభ్యులంతా ఒక కుటుంబంలాగా ఉంటూ సమస్యలను మనమే పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శ్రీనివాస్, మాస్టర్ నాగరాజ, కమల్ బడేసాబ్, అక్రమ్, ప్రియాంక, శ్రీనివాసులు స్టార్ మాబు, నబి, రఫి, బాలు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):**



పలు కేసులలో నిందితులుగా ఉన్న రౌడీషీటర్లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ ఆర్‌వి. కొండారెడ్డి హెచ్చరించారు. సోమవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు మరియు ఎర్రచందనం అక్రమ రవాణా కేసులలో నిందితులుగా ఉన్న వారితో ఎస్ఐ కొండారెడ్డి సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడి ప్రస్తుత జీవన శైలి గురించి ఆరా తీశారు. గతాన్ని పూర్తిగా మరిచి అందరితో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. అలాగే అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీ అందరిపై పోలీసు నిఘా ఉంటుందని శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకారం అందించాలన్నారు.

## గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

**కేవి.పల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్తః**

మండలంలోని మతంపల్లె గ్రామ పంచాయతీ కలికిరి వాండ్లపల్లెలో పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ మండల తహశీల్దారుని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సొంత ఇల్లు లేకుండా ప్లాస్టిక్ పట్టలతో గుడిసెలు నిర్మించుకుని కాపురం ఉంటూ వస్తున్నారని గత ప్రభుత్వంలో ఇల్లు ఇస్తారని ఎంతో ఆనందపడిన చివరికి మాత్రం వారు మొండి చేయి చూపించారన్నారు. ఈప్రభుత్వంలోనైనా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ విషయమై స్పందించిన తహశీల్దారు స్పందించి వివరాలు కనుక్కొని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేసే విధంగా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజనులు, చెంగన్న, దొర, పాపయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి కూలి మతి

**పీలేరు, ఆగస్టు 19 ప్రభాతవార్తః**



నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలో రైలు కిందపడి కంకర మిషన్ దినకూలి మతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని చింతపర్తి పంచాయతీలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు జార్ఖాండ్ రాష్ట్రం సారక్‌గట్టుకు చెందిన లక్ష్మముర్మ్ కుమారుడు రామ్‌ముర్మ(30) కూలి పని నిమిత్తం మండలంలోని మద్దెలచెరువుపల్లె శంకర్ మిషన్‌లో పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున కాలకత్యాలు తీర్చుకునేందుకు చింతపర్తి సమీపంలోని రైల్వేగేటు దాటుకుని ఉన్న చెరువు వద్దకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుప్రతికి తరలించి విషయాన్ని మతుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

## పాఠశాల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**పీలేరు, ఆగస్టు 19 ప్రభాతవార్తః**



పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, గుట్కా మద్యం సేవించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ యుగంధర్ హెచ్చరించారు. చిత్తూరు రోడ్డు మార్గంలోని కాకతీయ హైస్కూల్ ఆవరనంలో సాయంత్రమైతే పోకరీలు యథేచ్ఛగా మద్యం సేవించడం బాటిళ్లు విసరడం గట్టిగా అరుచుకోవడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి అక్కడున్న స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని రాత్రిపూట మహిళలు తిరగడానికి భయపడుతున్నారని ఫిర్యాదుచేశారు. వెంటనే స్పందించిన సీఐ యుగంధర్ , ఎస్సై బాలకష్ణ తమ సిబ్బంది వెళ్లి యుద్ధ ప్రాతిపదికనగా జేసీబీ సహాయంతో స్కూల్ పరిసరాలు చదును చేయించారు. పట్టణంలో ఎక్కడైనా సరే ఆకతాయిలు వల్ల ఎలాంటి సమాచారం ఉన్న పోలీసు వారికి తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ ప్రజలను కోరారు. ప్రజలు ప్రజా సంఘాలు పోలీసులకుసహాయ సహకారాలు అందిస్తే మందుబాబులకు నిద్రలేని రాత్రులు ఎలా ఉంటాయో రుచి చూపిస్తామని ప్రజలకు రక్షణ కల్పిస్తామన్నారు.

## ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**




ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదివారం కడప నగరానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్ఎండీ ఖాసీం, సాగర్‌లను టూ వీలర్స్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు లయన్ జేకే ఖాదర్‌బాషా ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఆ తరువాత వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో కడప సమాచార శాఖ డీపీఆర్ఓ ఫొటోగ్రాఫర్‌గా ఖాసీం, సాగర్‌లు సేవలందించారని ఆయన గుర్తు చేశారు. 1994 నుంచి 2009 వరకు కడప జిల్లాలో నగరంలో ప్రభుత్వ అధికారులు మంత్రులు తాలూకా కార్యక్రమ ఫొటోలను తీసి దినపత్రికలకు పంపి మంచి హృదయుడు సాగరని కొనియాడారు. ఫొటోగ్రాఫర్లను అధికంగా ఆదుకునే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, సంఘ సేవకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

## పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

**పెండ్లిమర్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**



పౌర్ణమి సందర్భంగా దాతల సహకారంతో అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించడం జరిగింది. డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు పంగా చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, భక్తులు స్వామి వారిని ఆలయం చుట్టూ ఊరేగించడం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 19, ప్రభాతవార్త:

చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు స్కిల్ హబ్ కేంద్రం అందిస్తున్న 4 నెలల ఉపాది శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ అశోక్‌బాబు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి.నాగార్జున సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితశిక్షణ మరియు ఉపాదికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ హబ్ కేంద్రంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ మరియు అసిస్టెంట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, ఉపాధి ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి ఆపై చదివి ఆసక్తి గల విద్యార్థులు అర్హులు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ అశోక్ బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున పిలుపునిచ్చారు. వివరాలకు 8886297300 నంబరును సంప్రదించాలన్నారు.

## పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

కలికిరి, ఆగస్టు 19, ప్రభాతవార్త:



మండలంలోని పంచాయతీలు అభివృద్ధి చేయడంలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీడీవో గంగయ్య అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు కార్యదర్శులకు ప్రభుత్వం ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ శిక్షణలో రీసోర్స్ పర్సన్లు శేషగిరి కుమార్ పంచాయతీలలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఏవిధంగా జీపీడీపీ గ్రామ పంచాయతీ ప్రణాళిక, ద్రవ, ఘన, వ్యర్థపదార్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణపై సర్పంచులకు శిక్షణలో విపులంగా వివరించారు. సర్పంచులు ఏవిధంగా పంచాయతీ అభివృద్ధికి ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ పరశురాం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఎ.రెడ్డిరామ్, జాహీదా, శశికళ, సైపుల్లా, అరుణ, గంగయ్య, ఆర్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరవాండ్లపల్లెలో మంచినీటి సమస్య పరిష్కారం

కలికిరి, ఆగస్టు 19, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ వీరవాండ్లపల్లె గ్రామంలో మంచినీటి సమస్యను స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి గాయత్రి పరిష్కరించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరును కేబులు వైర్లను కొందరు దుండగలు తస్కరించి మోటారు పనిచేయకుండా చేశారు. దీంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. స్థానికులు సర్పంచి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో రక్షిత మంచినీటి బోరు మోటారుకు మరమ్మతులు చేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## వైద్యురాలిపై హత్యాచార ఘటన అమానుషం

కడప కార్పొరేషన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:



పశ్చిమ బెంగాల్‌రాజధాని కలకత్తా ఆర్‌జీకేఆర్ ఆసుపత్రిలో మౌమిత అనే వైద్యురాలిపై హత్యాచారం చేయడం బాధాకరమని శ్రీసాయి యువజన సేవా సంఘం ఛైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. సోమవారం కడపలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి అమానుష ఘటనలు మరలా పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్న వైద్యులకు తన సంఘీభావం తెలిపినట్లు చెప్పారు.

## వరి, వేరుశనగ పంట పొలాల పరిశీలన

కలికిరి, ఆగస్టు 19, ప్రభాతవార్త:



మేడికుర్తి పంచాయతీలోని ఎద్దులవారిపల్లెలో పిలక దశలో ఉన్న వరి మరియు ఊడల దశలో ఉన్న వేరుశనగ పొలాలను కేవీకే, కలికిరి కోఆర్డినేటర్ డా.కె.మంజుల మరియు ఇతర శాస్త్రవేత్తలు పరిశీలించారు. వరిలో పొటాష్ మరియు జింకు లోపాల క్షణాలను గమనించారు. వాటి నివారణకు గాను 13.0.45 లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారి చేసిన వారం తరువాత జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే కొన్ని వరి పొలాల్లో అగ్గి తెలుగు యొక్క లక్షణాలైన ఆకులపై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిదరంగు గల నూలు కండె ఆకారపు మచ్చలు గమనించారు. అగ్గి తెగులు పొలం గట్టు చివర్ల మొదలై లోపలికి వ్యాపించడాన్ని రైతులకు చూపించారు. వ్యాధి తీవ్రత బాగానే ఉందని చెప్పారు. రాత్రి పూట కొద్దిగా మంచుతో ఉష్ణోగ్రతలు తక్కువగా మరియు పగటి పూట ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ వారంలో నమోదయ్యాయి. ఈ పరిస్థితిలో అగ్గి తెగులు అనుకూలంగా వ్యాపిస్తుందన్నారు. వాటి లక్షణాలను, తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సోమశేఖర్‌బాబు, మాధురి, పీరు సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యకార్మికుల సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు సోమవారం మున్సిపల్ కమీషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మున్సిపాలిటి పారిశుద్ధ్య కార్మికులు 2019 నుంచి పోరాటం చేస్తున్న వారికి ఇప్పటి వరకూ ఈపిఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈపిఎఫ్‌లో వున్న నగదును కుటుంబ అవసరాలకోసం రుణంగా తీసుకునే అవకాశం లేకపోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గతంలో పారిశుద్ధ్యకార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి వున్న అనేక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 1 నుంచి విధులు కూడా బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పృథ్వీరాజ్, భాగ్యమ్మ, వెంకటరత్నమ్మ, నాగరాజు, లోకేష్, శ్రీనివాసులు, మధు, శేఖర్, ఉమారాణి, ఓబులేష్ తదిరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రికార్డులకు నిప్పుపెట్టిన నిందుతులు ఎవరో బయటపెట్టండి

మదనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంకు సంబంధించిన నిందుతుల ఎవరో బయటపెట్టాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మదనపల్లె పట్టణ పరిసరాల్లో వున్న కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వం భూములు, చెరువులు, వాగులు, వంకలు కబ్జాకు గురైయ్యాయన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించిన ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద నిందితులను ఇప్పటి వరకూ పట్టుకోలేకపోవటం విడ్డూరంగా వుందన్నారు. స్వయంగా రాష్ట్ర పోలీస్‌బాస్ మదనపల్లెకు విచ్చేసి విచారణ చేసినా నిందితులను అదుపులోకి తీసుకోకపోవటంలో మర్మం ఏమిటో ప్రజలకు తెలపాలన్నారు. ఆ కేసులో ప్రభుత్వం కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేకపోయిందన్నారు. ఇప్పటికైన భూబాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాధవ, తిరుమల, సూరి, కమలాకర్ పాల్గొన్నారు.

## మహిళ ఆచూకీ లభ్యం

రామాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన కొరివి జయశ్రీ(20) ఇంటి నఉుంచి వెళ్లిపోవడంతో ఆమె భర్త గంగాధర కనిపించలేదని ఈ నెల 15వ తేదీ పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో ఆమె ఫోన్ కాల్ డేటా ప్రకారంగా సుండుపల్లి మండలం సానిపాయిలో ఉన్నట్లు ఫోన్ డేలాలో తెలియడంతో వెంటనే రామాపురం ఎస్సై సిబ్బందితో వెళ్లి ఆమెను రామాపురం పీఎస్‌కు తీసుకువచ్చినట్లు ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. వెంటనే ఆమె భర్తకు సమాచారం ఇచ్చి పోలీసు స్టేషన్‌కు రమ్మని చెప్పారు. జయశ్రీని భర్త గంగాధరకు అప్పగించినట్లు ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ శర్మ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వెలుగుపాఠశాలలో ఘనంగా ఫోటోగ్రఫి దినోత్సవం

మదనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :



వెలుగు ప్రత్యేకపాఠశాలలో ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. సోమవారం మదనపల్లె ఫోటోగ్రాపర్లు, వీడియోగ్రాపర్లు అసోషియేషన్ సభ్యులు ఫోటోగ్రఫి దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌భాషా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా దివ్యాంగులు, వృద్దులకు వెలుగు సంస్థ చేస్తున్న సేవలు మరవలేనివన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవంను దివ్యాంగుల సమక్షంలో జరుపుకోవటం సంతోషంగా వుందన్నారు. మనుషులు ఎలా వున్నా అందంగా చూపెట్టేది ఫోటోగ్రఫి మాత్రమే అన్నారు. మదనపల్లె ఫోటోగ్రాపర్లు, వీడియోగ్రాపర్లు వారికి వచ్చే అతి తక్కువ సంపాదనలోనే సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం దివ్యాంగులకు, వృద్దులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ శివప్రసాద్, మదనపల్లె ఫోటోగ్రాపర్లు, వీడియోగ్రాపర్ల అసోషియేషన్ సభ్యులు, వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ యం.గీత, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దందాలు చేసే సంస్కృతి టిడిపిది కాదు

మదనపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :



దందాలు చేసే సంస్కృతి తెలుగుదేశం పార్టీది కాదని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం టిడిపి నాయకులు ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లెలో ఇసుక ఆక్రమ తరలింపులపై సిపిఎం పార్టీ నాయకులు శ్రీనివాసులు చేసిన ఆరోపణలను ఖండించారు. అధారాలు వుంటే బయటపెట్టాలన్నారు. అనవసరంగా తెలుగుదేశం పార్టీ నాయకులపై విమర్శులు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంపై తాము బహిరంగా చర్చకు సిద్దమన్నారు. స్వంత ఇంటిపనులు చేసుకుంటుంటే కూడా ఇసుక దందాని చెప్పటం తగదన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై అనవసర విమర్శులు చేసి ఎమ్మెల్యేకి చెడ్డపేరు తెవాలని కుట్రలు పనుతున్నారన్నారు. ఇలాంటి ఆరోపణలకు టిడిపి భయపడదన్నారు. మదనపల్లెలో ఇసుక రీచ్‌లు లేవని, ట్రాక్టర్స్ ద్వారా ఇసుక తోలుకొని ఇంటినిర్మాణాలు చేసుకుంటున్న పేదల కడుపుకొట్టదన్నారు. కార్యక్రమంలో ఆర్.జె.వెంకటేష్, షంషీర్, నాదేళ్ల విద్యాసాగర్, జెసిబి మధు, సుధాకర్, వేణుగోపాల్, కమలామర్రి కృష్ణ, తమ్మిశెట్టి రామకృష్ణ, నాదేళ్ల శివన్న, సహదేవనాయుడు, పెంచపాడు స్వామి, జివి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు

మదనపల్లెక్రైం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మదనపల్లె సర్వజన భోధనాస్పత్రిలో రాత్రివేళ ఆసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు తెలిపారు. సోమవారం ఆయన ఆసుపత్రి పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఆక్సిజన్ ఫ్లాంట్ సమీపంలో మద్యం బాటిళ్లు పడివుండటం గుర్తించి సెక్యూరిటీ సిబ్బందిని మందలించారు. వెంటనే సిసికెమెరాలను పరిశీలించి ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించిన వారిని గుర్తించి డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే ఆసుపత్రి స్థాయి పెరిగిందని, దానికి తగ్గట్లుగా ఔట్‌పోస్టు సిబ్బంది పెంచాలని డిఎస్‌పి దృష్టికి తీసుకెళ్లతామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది కూడా అప్రమత్తంగా వుండి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో కొందరు సిబ్బంది రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్‌ఎంఓ ప్రసాద్‌రాజు, డిప్యూటి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొండలో ఘనంగా కుంభాభిషేకం

తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త:



మండలంలోని మల్లయ్య కొండలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవాదాయశాఖ ఈవో రమణ, రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట ఆధ్వర్యంలో కుంభాభిషేకం ప్రధాన అర్చకులు కుమారస్వామి, ఈశ్వరప్ప, మల్లికార్జున స్వాముల ఆధ్వర్యంలో అగ్నిహోత్రం, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పలు సాంస్కృతిక కార్యక్రమాలు, శివనామ సంకీర్తనలు, చెక్క భజనలు, కోలాటాలు, ప్రత్యేక వాయిద్య బృందాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాల నుంచి శివ భక్తులు హాజరవడం విశేషం.

## విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలి

గాలివీడు, ఆగస్టు 19(ప్రభాతవార్త):



విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నెలవారీ సముదాయ సమావేశాల్లో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్జీటీలకు ఈన ఎల 17 నుండి 19 వరకు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలో భాగంగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులు మత్తు పదార్థాలను వినియోగించకుండా మరియు పాఠశాల పరిసరాల్లో విక్రయించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్టూడెంట్ కిట్స్ విద్యార్థులందరికీ చేరేలా చూడాలన్నారు. ఉత్తమ అభ్యసనాల ద్వారా విద్యార్థి నైపుణ్యాలను వెలికితీసేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, దుర్గేశ్వర్‌రాజు, ఆర్‌పీలు ఉపేంద్ర, రామేశ్వర్, నాగరజు, సివి రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్థలం వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ

ముద్దనూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:



యర్రగుంట్ల, తాడిపత్రి బైపాస్ దగ్గరలోని శ్రీ వివేకావర్ధిని జూనియర్ కళాశాల సమీపంలో స్థలం వివాదంలో సోమవారం కూటమి నేత అలీషార్ మరియు తన వర్గానికి చెందిన వ్యక్తులు కొలతలు వేస్తూ రాళ్లు నాటుతుండగా అక్కడికి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మేనమామ అయిన కుదుముల ముని రాజారెడ్డి వచ్చి మా స్థలంలో ఎవర్రా రాళ్లు నాటుతున్నారు అని అనడంతో వివాదం చోటు చేసుకుంది. ఒకరిని ఒకరు దూషించుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి సీఐ దస్తగిరి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటుచేశారు. ఏదైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని కూటమి నేతలు మరియు వైసీపీ నేతలకు సీఐ తెలిపారు.

## టౌన్ బ్యాంక్ అధ్యక్షులుగా బివి సుబ్బారెడ్డి ఎన్నిక అభినందనీయం

ప్రొద్దుటూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ అధ్యక్షులుగా టిడిపి నాయకులు వెంకట సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయం అని ఎమ్మెల్యే నంద్యాల వందరాజుల రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టౌన్ బ్యాంక్ సభ్యులుగా 17ఏళ్ల అనుభవం గల వెంకట సుబ్బారెడ్డి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. దీంతో టౌన్ బ్యాంకు అధ్యక్ష పదవిని తెలుగుదేశం పార్టీ కైవలం చేసుకున్నట్ల యిందన్నారు. టౌన్ బ్యాంక్ అభివృద్ధికి అధ్యక్షులుగా ఎన్నికైన సుబ్బారెడ్డికి సభ్యులంతా సహకరించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నిక కావడానికి సహకరించిన సభ్యులకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డికి తదితర టిడిపి నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఈవి సుధాకర్ రెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు సురేష్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, ఎంపీకి కతజ్ఞతలు తెలిపిన సర్పంచి హబీబ్‌బాషా

పీలేరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలో తమ నివాసంలో పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచిగా రెండవసారి బాధ్యతలు చేపట్టినందుకు ఇరువురికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకటరమణారెడ్డి, వెంకటరమణ, నాగభూషణం, మహబూబ్‌బాష, ఆబిద్, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

పెద్దమండ్యం ఆగస్టు 19 ప్రభాతవార్త

విజన్‌కల్గి ముందుచూపుతో భవిసత్తును యువతకు ఉద్యోగకల్పనకు అవకాశంకల్పించే నాకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని మాజి మండల అధ్యక్ష్యుడు సిద్దవరంప్రసాద్ అన్నారు. శ్రీసిటీలో 15కంపెనీలకు సోమవారం శంకుస్థాపన చేసి 9వందలకోట్ల పెట్టుబడితో సమస్థలకు శంకుస్తాపన చేయడం యువతకు భరోసాకల్పిచడమేనన్నారు. వీటిద్వారా సుమారు3వేలమందికి ఉపాదిఅవకాశాలు దక్కుతాయన్నారు. 2017-18లోఅమరావతికి తరలివచ్చిన కంపెనీలను తిరిగిరప్పించి యువతకు లక్షల్లో ఉపాదికలి ్పంచే విధంగాఅడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకురైతులకు ఎల్లప్పుదు అందుబాటులో ఉండిచేయూతను అందించి మహిళలను ఆర్దికంగా ఎదుగుదలకు కృషిచేయడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం సేవలందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని గతప్రభుత్వం అప్పులపాలుచేసి వ్యవస్తను నాశని చేసిందన్నారు. ఈ అభివృద్దిని చూడలేక మాజి ముఖ్యమంత్రి జగన్ వారి అనుచరులు విమర్శలు చేయడం తగదన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

రాయచోటి, ఆగస్టు 19, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయ సమితి స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ జిల్లాకు విజ్ఞప్తి లేఖ పంపడం జరిగిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు సెప్టెంబరు 16 లోగా నవోదయ.గో.ఇన్ నందు రిజిస్టరు చేసుకోవాలన్నారు. 2025 జనవరి 18న ఎంపిక పరీక్ష ఉంటుందని మరిన్ని వివరాలకు 8247702733 నంబరును సంప్రదించాలన్నారు.

## ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించాలి : ఎంపీడీఓ

పెనగలూరు, ఆగస్టు 19, ప్రభాతవవార్త :



ఈ నెల 23వ తేదీన మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయితీ సెక్రటరీ, ఇంజపీరింగ్ అసిస్టెంట్ మండల కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రసారం అయిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పత్రికా విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలలో ఈ నెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కొనిదల పవన్ కల్యాణ్ ఆదేశించారని తెలిపారు. వారి ఆవేశానుశారం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. ఈ గ్రామ సభలలో ముఖ్యంగా ఉపాధి హామీ పనులలో చేపట్టాల్సిన పనులు ఆమోదం కోసం గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. మరియు ఆ పనులకు సంబంధించిన విధి విధానలపై కూడా చర్చించాలన్నారు. ఈ పథకం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఖర్చు చేసే ప్రతి రూపాయి తప్పని సరిగా ఉపాధి కూలీకి చేరే విధంగా పనుల జాబితాలు రడీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా సోషన్ అడిట్ విభాగం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ విషయం పట్ల వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల, జిల్లా అధికారులతో మాట్లాడాడని తెలిపారు. కావునా మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో ఖచ్చితంగా గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు.

## రాజుల చెరువు ఆక్రమణ - స్పంధించిన అధికారులు - ఆక్రమణలు తొలగింపు

రైల్వే కోడూరు, ఆగస్టు19,ప్రభాతవవార్త :



మండలంలోని పొట్టిరిజుగారిపల్లె గ్రామ సమీపంలో రాజుల చెరువు గత పది రోజులుగా జేసిబి లతో చెరువును చదును చేసి సర్వే నెంబర్: 1848,1849,1850 లకు సంబంధించిన చెరువును ఓ వ్యక్తి ఆక్రమించి మామిడి చెట్లు నాటాడని అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్య రాజు, శంకర్ రాజు మరియు గ్రామస్థులు కలసి డిప్యూటీ తాహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో వారు వ్యక్తి చెరువును ఆక్రమించుకుని మామిడి చెట్లు నాటాడని ఎవరైనా అడగడానికి వెళితే నేను ఎర్రచందనం బిజినెస్ చేసేవాడిని అని ఎవరైనా అడ్డుతగిలితే మీ తోటలో కూడా రెండు ఎర్రచందనం దుంగలు వేసి మిమ్మల్ని కేసుల్లో ఇరికిస్తాను అని బెదరించడం మొదలు పెట్టాడని తెలిపారు. స్పంధించిన డిప్యూటీ తహశీల్దార్ విఆర్‌ఓ కి చెప్పి చెరువులో ఉన్న మామిడి మొక్కలను పీకించి వేశారు. చెరువును ఆక్రమించిన లక్ష్మీకర్ కి నోటీసులు అందిస్తామని కేసులు కూడా పెడతామని తెలియజేశారు. ఇకనైనా పై అధికారులు కబ్జా చేస్తున్న వారిని ఆపుదల చేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని తెలిపారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

గాలివీడు, ఆగస్టు 19(ప్రభాతవార్త):



కోల్‌కతాలోని అర్జీకర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల ఏపీఎస్ఎఫ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో హత్యాచార ఘటనకు నిరసనగా గేటు వద్ద నుంచి బస్టాండు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై హత్యాచారం చేయడం సభ్యసమాజం తలదించుకునేలా చేసిందన్నారు. ఇంతటి పాశవిక హేయమైన నేరానికి పాల్పడిన వారిని ఉపేక్షించరాదన్నారు బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఈ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు చెల్లించిన టీడీపీ నాయకులు శివారెడ్డి

గాలివీడు, ఆగస్టు 19(ప్రభాతవార్త):



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పాటు రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించాలని కాంక్షిస్తూ ఎన్నికల ముందు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి చేసుకున్న మొక్కును చెల్లిస్తూ టీడీపీ నాయకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పెద్దూరు బ్రాహ్మణ వీధిలో కొలువైవున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి విజన్ కలిగిన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ పాదయాత్రలో తన వెన్నంటే ఉంటూ తన మీద అభిమానం చూపిన ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్తకీ, అభిమానులకూ, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కసిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో పౌర్ణమి రోజున అన్నదానం

ప్రొద్దుటూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పట్టణంలో గత రెండున్నర సంవత్సరాలుగా టిడిపి బిసి నాయకులు చల్లా రాజ గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా సోమవారం శ్రావణ పౌర్ణమి సంధర్భంగా స్థానిక పెద్దమ్మ తల్లి దేవాలయం సమీపంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 300మంది దాకా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, సీతంపల్లి రమణ ప్రసాద్, బంగి శివ, జయచంద్ర యాదవ్, నల్లం రవిశంకర్, రామయ్య, గౌడ్, నాయిబ్రాహ్మణ శ్రీనివాసులు, బిసి నాయకులు రామచంద్ర రాజు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఓ మహా యజ్ఞంలా నిర్వహించండి

తంబళ్లపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగే పనులు రైతులు, కూలీలకు ఉపయోగపడి ఓ యజ్ఞంలా నిర్వహించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ సూచించారు. సోమవారం ఆయన అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో అన్ని వర్గాలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రచించిందని ఇందులో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 23న ఒక రోజు మండలంలోని 23 పంచాయతీలలో గ్రామ సభలతో ఉపాధి హామీ పథక ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరించి స్థానిక ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో గ్రామ సభలు నిర్వహించి రైతులకు ఉపయోగపడే పండ్ల తోటలు, గడ్డి పెంపకం, సిరికల్చర్ వంటకాలువల పూడికతీత, నీటిపరివాహక ప్రాంతాల కాలువలు, ఇంకుడు గుంతలతో పాటు మొక్కల పెంపకం, నీటి నిల్వ చేసే కార్యక్రమాలు ముమ్మరం చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఏవో ఆనంద్‌కుమార్, ఏపీవో అంజనప్ప, ఈసీ రామన్న, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలీసులకు రాఖీ కట్టిన విద్యార్థులు

**పీలేరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో రక్షాబంధన్ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులకు సిబ్బందికి విద్యార్థులు రాఖీలు కట్టి, స్వీట్లు ఇచ్చి వారి దీవెనలు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మీరే మానమ్మకం, మీరే మారక్ష, రక్షాబంధన్ శుభాకాంక్షలు సార్ అంటూ చెప్పడంతో పోలీసు అధికారులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు స్వీట్లు తెప్పించి ఇచ్చి బాగా చదువుకుని ఉన్నత స్థితికి వచ్చి సమాజ సేవ చేయడానికి కషిచేయాలని చెప్పారు. అనంతరం 104 సిబ్బందికి విద్యార్థులు రాఖీలు కట్టారు. ఈకార్యక్రమంలో ఏబీసీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు



**రాయచోటి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మార్చ్‌ఫాస్ట్‌లో ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్ విద్యార్థులను సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి కలెక్టరు ద్వారా అభినందనలు పొందిన వారిలో రామసముద్రం మండలం ఏపీ మోడల్ స్కూలు స్కౌట్ విద్యార్థి ఎస్.నిజాముద్దీన్, గాలివీడు మండలం నూలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం విద్యార్థినిలు భవిత, నసీబ్‌లు ఉన్నారు. కలెక్టరుతో పాటు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తన కార్యాలయంలో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై మహిళా ఎస్సైలు ఆరా..



**కడప క్రైం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

జిల్లాఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప నగరంలో ఉన్న 13 కళాశాలల విద్యార్థినిలను ప్రైవేటు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను సందర్శించి సమస్యలను మహిళా ఎస్సైలు, మహిళా పోలీసు సిబ్బంది తెలుసుకున్నారు. అలాగే ప్రైవేటు బాయ్స్ హాస్టళ్లను పోలీసులు తనిఖీ చేశారు. నిబంధనల మేరకు హాస్టళ్లకు సంబంధిత అధికారులు గుర్తింపు ఉందా లేదా అని ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనల మేరకు నడుచుకోవాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు, మహిళా పోలలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్యక్రాంతమవుతున్న చెరువులను ప్రభుత్వ భూములను కాపాడాలి

**మైదుకూరు రూరల్, ఆగష్టు 19, ప్రభాతవార్త:**

మైదుకూరు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ లోని పన్నూరమ్మ చెరువు, గోడేరు చెరువు, ఎర్ర చెరువు లలోని భూమి విస్తీరన్ని అన్యక్రాంతమవుతున్నా వాటిని చూసి ప్రభుత్వ రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి కాపాడాలని కోరుకుంటూ అలాగే సర్వే నెంబరు 138 సి లో 12 ఏసి భూమి కుంటను ఆక్రమించారని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అలాగే నేషనల్ హైవే ప్రక్కన 77 సర్వే నెంబర్ లో గయాలు ల్యాండ్ ను, 742 సర్వేనెంబర్, రస్తాను కూడా గత మూడు రోజుల నుండి జెసిబి ల ద్వారా చదును చేస్తున్నారని. 231 సర్వే నెంబరు దాదాపు 12 ఏసి భూమిని, జెసిబి ద్వారా చదును చేస్తున్నారని. తిప్పిరెడ్డిపల్లె పంచాయతీ చెరువులు కుంటలు ప్రభుత్వ భూములను కాపాడాలని తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ నాగేంద్ర మండల రెవెన్యూ అధికారికి లెటర్ ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడమైనది. అలాగే అన్యక్రాంతమైన చెరువులను ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు సాగుకు అనుకూలమైనది పేదలకు పంచాలని లేనిపక్షంలో ప్రభుత్వం హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కొందరు కండబలముతో చదును చేసిన ప్రభుత్వ భూములను వ్యాపారములుగా మలుచుకొని పేదలకు లక్షల్లో మధ్యవర్తితో అమ్మడం జరుగుతున్నాయి ఇలాంటి కేసులు తిప్పిరెడ్డిపల్లె పంచాయతీ ఏరియాలో భూములు అమ్ముకున్న సమస్యలు ఆన్లైన్ కాక రైతులు ఎన్నో ఇబ్బందులు గురువతున్నారు. లక్షలు పెట్టి కొని కూడా ఇతరుల పేరు పై భూములు ఉండడం రికార్డులు చూస్తే అర్ధమవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని నిజమైన భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అట్టహాసంగా ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**వేంపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**



వేంపల్లెలో 119 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వేంపల్లె ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఆర్యవైశ్య మహిళా మండల ఇనూతన అధ్యక్షురాలిగా పచ్చిపులుసు ప్రవీణ, ఉపాధ్యక్షురాలిగా బైరిశెట్టి నాగలక్ష్మి, గోనుగుంట్ల సంధ్యారాణి, కార్యదర్శిగా వడ్లకుంట మృదుల, కోశాదికారులుగా పుల్లగూర శ్రీదేవి, గోనుగుంట్ల శ్రావణి, ఉప కార్యదర్శులుగా దారా నాగవాణి, వడ్లకుంట శైలజతో పాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారు మాట్లాడుతూ మహిళా మండలి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార యృక్రమంలో గండి శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు రాయవరం శివ రావు, అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీకిషోర్, ఉపాధ్యక్షుడు బైరిశెట్టి బాల గంగాధర్, వేంపల్లె ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి ఆరవేటి వెంకటేశ్వర్లు గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల హ రికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ఫోటోగ్రఫీ డే

**వేంపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**



వేంపల్లెలో సోమవారం ఫోటోగ్రఫీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేంపల్లెలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేంపల్లెలోని డాక్టర్ వైఎస్ఆర్ పార్కులో కేకు కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లెలోని ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్, డ్రోన్ ఆపరేటర్స్, మిక్సింగ్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యురాలి మృతిపై వేంపల్లెలో నిరసన

### - బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ భారీ ర్యాలీ



**వేంపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

ఇటీవల అరాచకశక్తుల చేతిలో వైద్యురాలి మృతిపై వేంపల్లెలో సోమవారం వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలంటూ మాజీ జడ్పీటీసీ, డాక్టర్ ఎస్ఎఫ్ బాషా ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. లిటిల్‌ఫ్లవర్, చైతన్య, ఉషాకిరణ్, నారాయణ, స్వామి వివేకానంద పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, అక్షర, దేవి కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు భారీగా ర్యాలీ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ చేశారు. అమ్మవారిశాల వీధి నుండి గాంధీరోడ్డు, అడ్డరోడ్డు చేరుకుని మానవహారంగా ఏర్పడి అక్కడ 20సూత్రాల అమలు కమిటి మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పాఠశాలల కరస్పాండెంట్లు చక్రపాణిరెడ్డి, రమణారెడ్డి, ముబీనా, కళాశాలల కరస్పాండెంట్లు శ్రీకాంత్‌రెడ్డి, భారతి, వైద్యులు లక్ష్మిప్రియ, అన్వర్‌ఉల్‌హక్, బీజేపీ నాయకురాలు సుష్మ తదితరులు మృతిచెందిన వైద్యురాలి కుటుంబానికి న్యాయంచేయాలని, ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, అలాగే మహిళలు రాత్రిపూటకూడా స్వేచ్ఛగా తిరిగే స్వాతంత్ర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు భాస్కర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే తెదేపా ప్రభుత్వ ధ్యేయం

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**



రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిలు అన్నారు. ముద్దనూరు మండలంలోని శెట్టివారిపల్లె వద్ద సోమవారం డ్యామ్ రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వామికొండ ప్రాజెక్టు కింద 10వేల ఎకరాలకు, సర్వరాయ సాగర్ కింద 25వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సాగునీరు అందించి రైతులను ఆదుకోవడమే టీడీపీ లక్ష్యం



**పులివెందుల, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. సోమవారం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బీటెక్ రవి మోటర్లు ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రోజుకు 1000 క్యూసెక్కుల చొప్పున 45రోజుల పాటు నీరు సరఫరా అవుతుందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సీబీఆర్‌కు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు

**పులివెందుల రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

పులివెందుల అర్బన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు డి.హాజీవలి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పులివెందుల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరుగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న ఎంపీ

**సింహాద్రిపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు పూర్ణకుంభ విశేషంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని ఎంపీ దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాఆట్లడుతూ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరపడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం వైకాపా నాయకులతో కలిసి ఆయన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## వ్యాపారుల సిండికేట్‌తో చీనీ రైతులకు తీవ్ర అన్యాయం



**పులివెందుల, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

చీనీ వ్యాపారులు సిండికేట్ అవడంతో చీనీ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, సరిచేయాల్సిన వ్యవసాయ మార్కెట్ కమిటి అధికారులు చోద్యం చూస్తూ వ్యాపారులకు కొమ్ము కాస్తున్నారని, చీనీ మార్కెట్ ధరలపై రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు అన్యాయం జరుగుతోందని, అక్కడ ఉన్న రైతులు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా మార్కెట్ కమిటికి సంబంధించిన ఉద్యోగులు రైతులకు న్యాయం జరిగేలా నడుచుకుంటారని, కానీ పులివెందులలో అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని ఎమ్మెల్సీ అన్నారు. వ్యాపారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఢిల్లీ, నాగపూర్, తదితర మార్కెట్ ధరలను చూసుకుని గిట్టుబాటు ధర వచ్చే విధంగా అధికారులు ప్రయత్నించాలన్నారు. అలా కాకుండా అధికారులు, వ్యాపారులు రైతులను నిలువునా మోసం చేయడం జరుగుతోందని ఎమ్మెల్సీ చెప్పారు. అంతేకాకుండా ఇదే మార్కెట్‌లో రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలకు కొనుగోలు చేసిన చీనీకాయలను ఒకే లోడులో బయట తీసుకోవడం జరుగుతోందన్నారు. దీన్ని బట్టి చూస్తే ఇక్కడ కొనుగోలు చేసేటప్పుడు వేర్వేరు రేట్లు చెల్లిస్తున్నారని, కానీ వారు విక్రయించే సమయానికి అన్నీ ఒకే రేటుకి అమ్ముతున్నారన్నారు. కావున రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని, ఇప్పటికైనా ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారైనా సరే, అధికారులైనా సరే తమ పద్ధతులు మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి హెచ్చరించారు. వ్యాపారస్థులు తమ వైఖరి మార్చుకోకుంటే భవిష్యత్తులో ప్రభుత్వమే చీనీకాయలను కొనుగోలు చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రమణారెడ్డి, మైసూరారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డబ్బులను వాడుకున్న పంచాయతీ సెక్రటరీ అరెస్ట్

**ముద్దనూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

మండలంలోని ఆరవేటి పల్లి-చింతకుంట గ్రామానికి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మట్టి రోడ్డుకు మంజూరైన డబ్బులను వాడుకున్న ఉప్పలూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ రాయపాటి రెహిమాన్‌ను సోమవారం నాడు అరెస్ట్ చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ సెక్రటరీ రాయపాటి రెహిమాన్ ప్రభుత్వ నిధులు 6,70,000 దుర్వినియోగం చేసినందుకుగాను అతనిపై ఫిబ్రరి 29వ తేదిన ముద్దనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని, అతనిని సోమవారం ఉదయం ముద్దనూరు నాలుగు రోడ్ల కూడలి నందు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా 14రోజులు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## సక్రమంగా గ్రామ సభలు నిర్వహించాలి

**దువ్వూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**



ఈనెల 23వ తేదిన ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులపై చర్చించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ శివప్రసాద్ అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మంత్రి ఉపాధి హామీ పనులపై ఏ విధంగా గ్రామ సభలు నిర్వహించాలని, ఎటువంటి పనులు ఆమోదించాలని అనే విశయంపై అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే సిమెంట్ రోడ్లు, డ్రైనేజి, పశువులు, గొర్రెలకు షెడ్ల నిర్మాణం తదితర పనులపై చర్చించి ఆమోదం తెలపాలన్నారు. వాటిని వెంటనే జిల్లా స్థాయి అధికారులకు అందజేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బందిని సమన్వయం చేసుకొని గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా బ్రిడ్జి రక్షణ గోడ

**ఖాజీపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఖాజీపేట, కడప జాతీయ రహదారిలో పత్తూరు వద్ద బ్రిడ్జి రక్షణ గోడ కూలిపోయి ప్రమాదకరంగా ఉన్నది. రక్షణ గోడ కూలిపోయి శిథిలావస్థలో ఉన్న పట్టించుకునే నాథుడే లేడు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరమ్మత్తులు చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నాయి. ఈ కారణంగా ఇక్కడ ప్రతి రోజు వందల సంఖ్యలో భారీ కంటైనర్లతో పాటు పలు వాహణాలు ప్రయాణిస్తుంటాయి, ఇక్కడ వాహణాలు ఎదురెదురుగా ప్రయాణించలేని పరిస్థితి. రాత్రి సమయంలో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. గతంలో లారీలు ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. ఈ రహదారిపై వాహణాల రద్దీ అధికంగా ఉంటుంది. భారీ వాహణాలు ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రహదారి వెంబడి పాదాచారులే కాకుండా మూగ జీవాలు కూడ తిరుగుతుండడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతోందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. రక్షణ గోడలు నిర్మించని పక్షంలో భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహణదారులు, సమీప గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలని కోరుకుంటున్నారు.

## కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దాం

**రాజంపేట అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**



కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దామని నేతలకు పిలుపినిచ్చిన తేదేపా పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు నేతలకు పిలుపునిచ్చారు. సోమవారం తన కార్యాలయంలో గుండ్లూరు మాజీ సర్పంచ్ ముమ్మిడి మదన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు జగన్ మోహన్ రాజును కలిశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమస్యలన్నింటిని సామరస్యంగా పరిష్కరించుకుందామని, ఎల్లప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సంధర్భంగా మాజీ సర్పంచ్ ముమ్మిడి మదన్‌మోహన్ రెడ్డి, స్కూల్ కమిటి చైర్మెన్ జల్లి సుబ్రహ్మణ్యం, మాజీ నీటి సంఘం చైర్మెన్ ముమ్మిడి వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నూక చంగల్ రెడ్డి, గంగ బాబుల్ రెడ్డి, సయ్యద్ గఫూర్, మలిశెట్టి శివకుమార్, పొత్తపి హరిబాబు, టిడిపి నాయకులు ఇండ్లూరు వీరయ్య, పగిడి కాలువ బుజ్జి, అహ్మద్ బాష, గాదిరాజు వెంకట సుబ్బరాజు, శివప్రసాద్ యాదవ్, చింటులు జగన్ మోహన్ రాజును సన్మానించారు.

## రాజంపేటలో ఘనంగా రాఖీ

**రాజంపేట అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**




స్థానిక నూనెవారిపల్లి రోడ్డులోని రీజెన్సీ నలంద పాఠశాలలో రాఖీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సీ.ఏ.ఓ.కే జయచంద్రా మాట్లాడుతూ పవిత్రమైన హిందూ పండుగ రక్షా బంధన్ అని, ఇది తోబుట్టువుల మధ్య శాశ్వత బంధాలను గర్తు చేస్తుందన్నారు. సోదరీమణులు తమ ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా తమ సోదరుడి చేతులకు పవిత్ర రాఖీని కడతారని, కొన్ని ప్రాంతాల్లో హారతి, తిలక్ కార్యక్రమాలు కూడ చేస్తారన్నారు. తమ సోదరి ప్రేమను నిలబెట్టడానికి, సోదరులు తమ సోదరీమణులను కష్టాల నుంచి రక్షించడానికి, ఎల్లప్పుడూ సహాయం చేస్తామని, అండగా ఉంటామని వాగ్దానం చేస్తారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు యల్.స్వాతి మాట్లాడుతూ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, సామరస్యానికి సంబంధించి పండుగగా రక్షా బంధన్ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ సంధర్భంగా రాఖీలు కట్టిన సోదర సమాన అబ్బాయిలకు మిఠాయిలు తినిపించారు. అలాగే శాన్విలో రాఖి పండుగ వేడుకలు బోయనపల్లిలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూలులో రాఖీ పండుగ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈఓ శంకర్ రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మళ మాట్లాడుతూ పిల్లలకు రాఖీ పండుగ యొక్క ఆవశ్యకతను వివరించారు. అన్నాచెల్లెల మధ్య అనుసంధాన్ని చాటే పండుగ రాఖీ పండుగ. రాఖీ అంటే రక్షణ బంధన్ అంటే సూత్రం కట్టడం అని అర్థం..అన్న చెల్లికి రక్షణ బంధంగా ఉండమే ఈ రాఖీ పండుగ అని ఇలా మరెన్నో విశయాలు పిల్లలకు వివరించారు. ఈ సంబరాల్లో పిల్లలు సంతోషంగా పాల్గొన్నారు.

## రసాయన శాస్త్ర పరిశోధనలపై షేక్ మహమ్మద్ అలీకి డాక్టరేట్

**పులివెందుల, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**



పులివెందుల మున్సిపాలిటీ జెండామానువీధికి చెందిన షేక్ మహబూబ్‌బాష కుమారుడు షేక్ మహమ్మద్ అలీకి అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల సోమవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. జేఎన్‌టీయూ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎన్.దేవన్న పర్యవేక్షణలో ఎల్‌సి ఎంఎస్ ఉపయోగించి ఫార్మాసూటికల్ డ్రగ్స్‌లో జీవో టాక్సిక్ ఇంప్యూరిటీలను గుర్తించడం, పరిమాణానీకరించడం కోసం విశ్లేషణాత్మక పద్ధతుల అభివృద్ధి, ధృవీకరణ అనే అంశంపైన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్‌ను జేఎన్‌టయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ వి.నాగప్రసాద్‌నాయుడు ప్రకటించారు.

## సరళ రుణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పులివెందుల, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**



పులివెందుల పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (మెయిన్ బ్రాంచి)లో ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు జనరల్ మేనేజరు పి.ఆర్.పడగెట వార్ అన్నారు. పులివెందులలోని ఏపీజీబీలో కొత్తగా ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. పులివెందులలోని ఏపీజీబీలో కొత్తగా ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సరళ రుణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం నుండి అవసరమైన రుణాలను అందించేందుకు ఏపీజీబీ సిద్ధంగా ఉందన్నారు. ఖాతాదారుల శ్రేయస్సు ప్రధాన లక్ష్యంగా ఏపీజీబీ అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. తమ బ్యాంకు సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజరు శ్రీనివాస్ ప్రసాద్, కడప ఎస్ఆర్‌కె ఇన్‌ఛార్జి షరీఫ్, రీజనల్ ఆఫీస్ ఎస్ఎం ప్రశాంత్, పులివెందుల మెయిన్ బ్రాంచి సీనియర్ మేనేజరు రాజేష్, పులివెందుల సరళ రుణ కేంద్రం మేనేజరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్లు మేనేజరు కిరణ్‌కుమార్, ఉమామహేశ్వరి, రోహిణికుమారి, ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, శశిధర్, నల్లపురెడ్డిపల్లె, అలవలపాడు, పులివెందుల పూలంగళ్ల, వేముల, వేంపల్లె, లింగాల మేనేజర్లు, అసిస్టెంటు మేనేజర్లు పాల్గొన్నారు.